క్లుప్తంగా


క్షమించు చాచా..!



తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు నివాళులర్పించడం పాలకులు మర్చిపోయారు. నవంబర్ 14న చాచా నెహ్రూ పుట్టిన రోజు సందర్భంగా బాలల దినోత్సవ కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. బీచ్ రోడ్డులో ఉన్న నెహ్రూ విగ్రహాలకు మాత్రం ఎక్కడ నివాళి అర్పించడం లేదు. నెహ్రూ విగ్రహాలపై కాకి రెట్టలు యథావిధిగా కనిపిస్తున్నాయి.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'షాకిల్స్ ఆఫ్ షాడో' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఏయూ ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రవి విన్సెంట్ రచించిన షాకిల్స్ ఆఫ్ షాడో పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆవిష్కరించారు. 52 విభిన్న కవితలతో సమాజాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలించి కవితలు రాసిన రవి విన్సెంట్‌ను వారు అభినందించారు. ఇది ఆంగ్ల విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టళ్ల తనిఖీ

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు గురువారం మహారాణిపేటలోని వర్సిటీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆయన మాట్లాడి వారికి అందుతున్న వసతులు, మెస్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య దాయమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. వార్డెన్లు ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య ఎస్.హరనాథ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీస్

ఆరిలోవ: ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కానందున సమ్మె చేయడానికి 108 ఉద్యోగులు సిద్ధమయ్యారు. 108 చినగదిలి మండలం పరిధి ఉద్యోగులు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు గురువారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి సమ్మె చేపట్టనున్నామన్నారు. సమ్మె నోటీస్‌ను రూరల్ తహసీల్దార్‌తోపాటు డీఎంహెచ్‌వోకు కూడా అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

హోం కేర్ యువకుడి అదృశ్యంపై కేసు



బీచ్‌కుమార్

ఆరిలోవ: ఆదర్శనగర్‌లోని ది బాన్యన్ హోం కేర్ నుంచి ఓ యువకుడు అదృశ్యమైనట్లు ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్‌ఐ బి.సిహెచ్.నాయుడు తెలిపిన వివరాలిలా.. మానసిక అనారోగ్యంతో ఆస్పత్రిలో ఎక్కువ కాలం గడిపిన వ్యక్తులను ఆదర్శనగర్ ది బాన్యన్ హోం కేర్ సంస్థలో చేర్చుతున్నారు. ప్రభుత్వ మెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఒడిశాకు చెందిన బీచ్‌కుమార్‌ను అతడి తల్లిదండ్రులు ఈ ఏడాది సెప్టెంబర్ 18న హోంలో చేర్చారు. ఈ నెల 11న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సిబ్బందికి తెలియకుండా యువకుడు బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో సంస్థ కో ఆర్డినేటర్ నిరుపమ గురువారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మల్లేశ్వరరావు మిస్సింగ్ కేసు నమోదు చేసి ఏఎస్‌ఐకు దర్యాప్తు కోసం అప్పగించారు. బీచ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు 87906 64566 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు శ్రీకాంత్‌నగర్, పెప్సీ గొడౌన్, సుందరయ్యనగర్, అంబేడ్కర్‌నగర్, పార్వతీనగర్, టీఐసీ పాయింట్, క్రాంతినగర్, ముస్తఫా కాలనీ, డ్రైవర్స్ కాలనీ, అన్నానగర్, బాలాజీనగర్, బీటీఆర్ నగర్‌ల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కార్తీక పౌర్ణమికి సిద్ధం



ఆర్కే బీచ్ రోడ్డులోని గోకుల్ పార్కు ప్రవేశ ద్వారం



శంఖంలో శ్రీకృష్ణుడి విగ్రహం

- ముస్తాబైన గోకుల్ పార్క్
- భారీ సంఖ్యలో తరలి రానున్న ప్రజలు
- రూ.30 లక్షలతో అభివృద్ధి చేసిన గత ప్రభుత్వం



మందిరంలోని రాధాకృష్ణుడి విగ్రహాలు

ఏయూక్యాంపస్: కార్తీక పౌర్ణమి వేడుకలకు ఆర్కే బీచ్ రోడ్డులోని గోకుల్ పార్క్ సిద్ధమైంది. ఈ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించే ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో నగరవాసులతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రముఖులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో పార్కులోని రాధాకృష్ణుల మందిర పరిసరాలు, ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. ఆలయానికి రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దారు. మందిర గ్రిల్స్‌కు మరమ్మతులు చేపట్టి, విద్యుత్ దీపాలతో అలంకరించడం పూర్తి చేశారు. పార్క్ చుట్టూ పచ్చని మొక్కల కుండీలను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. సుందరంగా విద్యుత్ దీపకాంతులతో పార్క్‌ను, పరిసరాలను ముస్తాబు చేశారు. పార్క్ ఎదురుగా బీచ్ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముచ్చట గొలిపే విగ్రహాలు

ప్రధాన ఆలయంలో రాధాకృష్ణుల విగ్రహాలు ఎంతో ముచ్చట గొలుపుతాయి. ఆలయం వెనుక భాగంలో చిన్నికృష్ణుడి కాళీయ మర్దనం, రోలుకు కట్టిన చిన్నికృష్ణుడి విగ్రహాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. ఇక్కడ ఫొటోలు తీసుకోవడానికి ఎంతోమంది ఆసక్తి చూపుతారు. వెనుక భాగంలో సముద్రం, వినీలాకాశం, ముందున చిన్నికృష్ణుడి విగ్రహాలు ఎంతో ప్రత్యేకంగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. విశాఖ సాగరతీరానికి వచ్చే వారికి ఈ పార్క్ ప్రత్యేక సందర్శనీయ స్థలంగా మారిపోయింది.



విశాలంగా గోకుల్ పార్క్

చారిత్రక ప్రాధాన్యం కలిగిన గోకుల్ పార్కును గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ రూ.30 లక్షల వ్యయంతో పూర్తి స్థాయిలో ఆధునీకరించింది. దీనిని ఒక పర్యాటక కేంద్రంగా

వైఎస్సార్‌సీపీ హయాంలో పార్కు అభివృద్ధి

తీర్చిదిద్దింది. పార్క్ ప్రవేశ మార్గం వద్ద వేణువు పట్టుకున్న శ్రీకృష్ణుడిని పోలిన విధంగా ఆర్చ్ నిర్మించారు. పార్కులోకి అడుగు పెట్టగానే రావి చెట్టు కింద ఉన్న రాధాకృష్ణుల విగ్రహాలు మనకు ఆధ్యాత్మిక స్వాగతం పలుకుతాయి. ఎడమవైపున శంఖంలో బాలకృష్ణుడి రూపం ఎంతో సహజ సిద్ధంగా నిలుస్తుంది. పార్క్‌లో కుడివైపున రాతి మండపంలో శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహం ఆలయంలో ఉన్నామనే భావన మనకు కలిగిస్తుంది.

జ్ఞానాన్వేషకులుగా యువత నిలవాలి



కృష్ణా లైబ్రరీలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ప్రొఫెసర్లు

విశాఖ విద్య: యువతరం జ్ఞానాన్వేషకులుగా నిలవాల్సిన అవసరముందని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గురువారం ఏయూ ప్రాంగణంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించి, వివిధ పుస్తకాలను తిలకించారు. విలువైన, అరుదైన పుస్తకాలను నేటితరానికి పరిచయం చేసేలా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, యువత వీక్షించాలని సూచించారు. వైవిధ్యమైన అంశాలకు సంబంధించిన పుస్తకాలకు ఏయు గ్రంథాలయం నెలవుగా నిలుస్తోందన్నారు. 5 లక్షలకు పైగా పుస్తకాలను కలిగి, అపార జ్ఞాన భాండాగారంగా ఈ గ్రంథాలయం పేరుగాంచిందని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పూర్తి సహకారం అందిస్తామని వీసీ తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఏయూ గ్రంథాలయం ఎంతో ఉపయోగంగా నిలుస్తోందన్నారు. ఇక్కడ చదువుకున్న ఎందరో విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉన్నత పదవుల్లో స్థిరపడటం దీనికి నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డీఎం'కు విశేష స్పందన



ఫోన్‌లో సమస్యలు వింటున్న మద్దిలపాలెం డిపో మేనేజర్ అరుణకుమారి

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి గురువారం విశేష స్పందన లభించిందని డిపో మేనేజర్ అరుణకుమారి తెలిపారు. ఫోన్ కాల్ ద్వారా తెలుసుకున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

- ప్రతి రోజు రాత్రి 11 గంటల సమయంలో మధురవాడ వరకు బస్సు సర్వీసు నడపాలని ఎంవీపీ కాలనీకి చెందిన జి.అప్పలనాయుడు కోరగా.. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.
- నిర్దేశించిన స్టాప్‌లో కాకుండా రోడ్డు మధ్యలో బస్సులు నిలుపుతున్నారని ఫిర్యాదులు అందాయన్నారు.
- ప్రతి బస్‌స్టాప్ వద్ద ప్రయాణికులకు స్టాప్ పేరు తెలిసేలా చర్యలు తీసుకోవాలని సురేష్ అనే ప్రయాణికుడు కోరగా.. దీనిపై సిబ్బందికి తగు సూచనలిస్తామన్నారు.
- భీమిలి నుంచి 999 బస్సులు సమయపాలన లేకుండా నడుపుతున్నారని ఎ.బుచ్చిబాబు ఫిర్యాదు చేయగా.. చర్యలు తీసుకుంటామన్నారు.
- జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ ఉన్నప్పటికీ బస్ డ్రైవర్లు బిగ్గరగా హారన్ కొడుతున్నారని శివాజీపాలేనికి చెందిన నూకరత్నం ఫిర్యాదు చేయగా.. అవసరం మేరకే హారన్ వినియోగించేలా డ్రైవర్లకు సూచిస్తామన్నారు.
- ఆనందపురం వద్ద హైవేపై బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆనందరావు, మూడు రోజుల ముందుగానే బస్‌పాస్ రెన్యువల్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని రవీంద్రనగర్ నుంచి జి.వి.రావు కోరగా.. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.
- డాబాగార్డెన్స్ లక్కీ షాపింగ్ మాల్ ఎదురుగా బస్‌స్టాప్ వద్ద షెల్టర్ ఏర్పాటు చేయాలని మంగరాజు, 52కే బస్సును రైల్వేస్టేషన్ మీదుగా పాత పోస్టాఫీస్ వరకు నడపాలని హర్షవర్ధన్ కోరగా.. పరిశీలిస్తామని చెప్పారు.
- ఆరిలోవ–గాజువాక మధ్య నడిచే 369 బస్సును పునరుద్ధరించాలని బి.సత్యనారాయణ ఆరిలోవ నుంచి కోరగా.. సరైన సర్వీసు లేకపోవడం వల్ల ఈ బస్సును నిలిపివేసినట్లు డీఎం వివరించారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు

మద్దిలపాలెం: ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో-మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల గోవింద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన మోటార్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సీఎం చంద్రబాబు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న విజయవాడలో తలపెట్టిన ఆటో-మోటార్ కార్మికుల మహాధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్, విద్యుత్ చార్జీలు, బియ్యం, పప్పులు, వంటనూనె ధరలు తగ్గించి డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. 21, 31 జీవోలు రద్దు చేయాలని, ఆటో-మోటార్ వాహన డ్రైవర్లకు వాహనమిత్ర పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మధురెడ్డి, రాంబాబు, మూర్తి, శ్రీనివాస్ సన్యాసిరావు, జోగారావు, భాస్కర్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు



కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ జయ



జాతీయ జెండా ఆవిష్కరించి షెల్యూట్ చేస్తున్న కార్పొరేటర్ మంగవేణి తదితరులు

మద్దిలపాలెం: విద్యాలయాల్లోని గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవితకు పునాది వేసుకోవాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ సూచించారు. గురువారం కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాల ఆవశ్యకత, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, ముగింపు సమావేశం నాడు బహుమతులు అందిస్తామని గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ అడ్వైజర్ శ్రావణ్‌కుమార్, అధ్యాపకులు కె.రవికుమార్, రాజేశ్వరరావు, ఎస్.వి.రామారావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీపీ శాఖ గ్రంథాలయంలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కార్పొరేటర్ గొలగాని మంగవేణి, పలువురు విద్యావేత్తలు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. సరస్వతీదేవి, చాచా నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 15న పుస్తక ప్రదర్శన, 16న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 18న చిత్రలేఖన పోటీలు, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక కార్యకర్త సత్యకుమార్, రచయిత సుసర్ల, పాఠకులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



జాలరిపేట స్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేట ప్రభుత్వ పాఠశాలలో గురువారం సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తిని పెంచేందుకు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు దాతలు తెలిపారు. నగరానికి చెందిన వైశ్యరాజు జ్యువెలర్స్ బ్రదర్స్ ఈ విగ్రహాన్ని దానం చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. పాఠశాలకు సౌండ్ సిస్టం అవసరముందని ఉపాధ్యాయులు తెలపగా.. త్వరలోనే అందజేస్తామని వైశ్యరాజు, భద్రగిరి రాజు బ్రదర్స్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీబీ రావు, బాబా బజార్ రవికుమార్, బొగిరి సీతారాం, టి.శివశంకర్, కె.జనార్దన్, ఐ.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గౌరమ్మకు సారె సమర్పణ



అమ్మవారి సారె ఊరేగిస్తున్న స్థానికులు

మద్దిలపాలెం: పాతవెంకోజిపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి సారె మహోత్సవం నిర్వహించారు. సంఘ మహిళలు ఒక్కొక్కరూ వివిధ రకాల మిఠాయిలు, పండ్లు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. వీటిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ఎదుట సారె ఉంచి పూజలు చేశారు. సారె మిఠాయిలను శనివారం నిర్వహించే అన్నదానంలో వినియోగిస్తామని గ్రామ అధ్యక్షుడు ఆడారి పరదేశి నాయుడు తెలిపారు. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, సంఘ గౌరవ అధ్యక్షుడు పీల వెంకట పరదేశినాయుడు, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఎ.శివప్రకాష్, సహాయ కార్యదర్శులు రఘు, మళ్ల కనకరాజు, రాజగిరి సురేష్, మళ్ల శ్రీను, ఆడిటర్ మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న ఖాన్

బీచ్‌రోడ్డు: బాలల దినోత్సవం సందర్భంగా గురువారం మానసిక దివ్యాంగ పిల్లలకు నిత్యావసర సరకులను ఎస్.ఖాన్ అందజేశారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేశారు. పిల్లలను దేశ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సహించాలన్నారు. హిడెన్ స్ప్రౌట్స్ స్కూల్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలలే సమాజ నిర్మాతలు

చిల్డ్రన్స్ డే వేడుకల్లో వక్తలు



ప్రభుత్వ బాలికల గృహంలో మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ



నేతాజీనగర్ పాఠశాలలో పిల్లలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్



శ్రీకృష్ణాపురం గురుకులంలో నెహ్రూ వేషధారణలో ప్రసంగిస్తున్న విద్యార్థి



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏడీజే రవికిరణ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



ఏయూ స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న కేసలి అప్పారావు తదితరులు

ఆరిలోవ: బాలలే భావి సమాజ నిర్మాతలని, మంచి ప్రవర్తనతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ ఆకాంక్షించారు. బాలల దినోత్సవ కార్యక్రమాలు గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ ప్రాంతంలోని విద్యాలయాలు పిల్లల ఆటపాటలతో సందడిగా మారాయి. ప్రభుత్వ బాలికల గృహంలో జరిగిన బాలల దినోత్సవంలో వెంకట శేషమ్మ పాల్గొని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, అతిథులతో కలసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. గృహం సూపరింటెండెంట్ ఎ.వి.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

- జీవీఎంసీ 10వ వార్డు నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు స్థానిక నాయకుడు బలగ సుధాకర్ సహకారంతో నోట్ బుక్స్, పెన్నులు, స్వీట్లు అందజేశారు.
- దీన్‌దయాల్‌పురం ప్రభుత్వం బాలుర గృహం, ప్రభుత్వం బాలుర పరిశీలనా గృహంలో అతిథులు, అధికారులు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథి జువైనల్ జస్టిస్ బోర్డు మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి మాట్లాడుతూ బాలలు హక్కులు, దేశ తొలి ప్రధాని నెహ్రూ గురించి వివరించారు. గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
- శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు విశాఖపట్నం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు, గురుకులం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ ట్యాక్స్ అదనపు డైరెక్టర్ జనరల్ రవికిరణ్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్, బాలవికాస్ పరిషత్ కార్యదర్శి నరవ ప్రకాశరావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ పిల్లల కోసం వీఎంఆర్‌డీఏ ఇంత పెద్ద వేదిక నిర్మించడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో చిల్డ్రన్స్ ఎరీనాలో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశ్వనాథన్ మాట్లాడుతూ భారత్ ఒక సూపర్ పవర్‌గా ఎదుగుతున్న వేళ పిల్లలు ముఖ్యమైన భూమిక పోషించాల్సిన సరైన తరుణమిదేనని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే అంకితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండేలా రాణించాలన్నారు. వీఎంఆర్‌డీఏ ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డీఎఫ్‌వో శివాని, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, అధికారులు పాల్గొన్నారు.

బాలల అభ్యున్నతే లక్ష్యం

విశాఖ విద్య: బాలల సమగ్ర వికాసం, అభ్యున్నతే లక్ష్యంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పనిచేస్తోందని రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యతోపాటు కళలు, యోగా, వ్యక్తిత్వ వికాసం, భావవ్యక్తీకరణ తదితర అంశాల్లో అవసరమైన తర్ఫీదు ఇవ్వాలన్నారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, యోగ విద్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఆచార్య బి.ప్రసాద్‌రావు, ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటపాటలతో అలరించిన విద్యార్థులు

ఎంవీపీకాలనీ: స్థానిక ఉషోదయ కూడలిలోని కిడ్జి గార్డెన్ స్కూల్‌లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో అలరించారు. నెహ్రూ, పలువురు దేశనాయకుల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఏయూ మాజీ వీసీ, సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలక్ష్మితో కలిసి వివిధ ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- 19వ వార్డు మత్స్యకార పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద హెచ్‌ఎం కె.వి.సత్యవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.
- ఎంవీపీ కాలనీ సెక్టార్-7లోని ఐఏఎంలో ఏఎస్ రాజా మహిళా కళాశాల, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు బాలల పరిరక్షణ కోసం కమిషన్ చేస్తున్న కృషిని కొనియాడారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు.

క్రీడలతో మానసిక వికాసం

బీచ్‌రోడ్డు: బాల్యం నుంచి క్రీడలతో మమేకం కావడం వల్ల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని ముఖ్య అతిథి హనుమంతరావు అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం శాంతి ఆశ్రమం వద్ద గ్లోబల్ ప్రీ స్కూల్ ఉత్సవాలు నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల వారిలో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవ పోటీలు

వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 85 ప్రాంతాల్లో నిర్వహణ



క్యారం బోర్డు ఆడుతున్న చిన్నారులు

మద్దిలపాలెం: బాలల దినోత్సవం సందర్భంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని 85 ప్రాంతాల్లో బాలలకు ఆటల పోటీలు నిర్వహించామని క్లబ్ కన్వీనర్ సుశీల తెలిపారు. మద్దిలపాలెం, మధురవాడ, ఆరిలోవ, అక్కయ్యపాలెం, జగదాంబ, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, మల్కాపురం, గాజువాక, స్టీల్‌ప్లాంట్ తదితర జోన్లలో ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. స్థానిక పెద్దలు, తల్లిదండ్రులు, వలంటీర్ల సహకారంతో బాలల దినోత్సవ పోటీలు ఉత్సాహంగా జరిగాయని చెప్పారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో డ్రాయింగ్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్, మ్యూజికల్ చైర్, సీనియర్లకు కబడ్డీ, కోకో, క్విజ్ వంటి పోటీలు నిర్వహించినట్లు సుశీల తెలిపారు. పిల్లలు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు క్రీడలను అలవాటు చేయాలన్నదే క్లబ్ ఆశయమన్నారు. పిల్లలకు ఆటల వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులు గుర్తించాలనే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. క్లబ్ జోన్ కన్వీనర్లు డి.కొండమ్మ, డి.శైలజ, గీతాంజలి, అరుణ, ఎల్లాజీ, అప్పారావు, కృష్ణారావు, కుమారి, స్వర్ణలత, సతీష్, సంధ్యారాణి, శ్రీకాంత్, దీపిక, విజయలక్ష్మి, రోహిణి, హేమ, సరోజిని, కృష్ణవేణి, సౌమ్య, మానస, దివ్య, జాహ్నవి, దివ్య, వర్షిణి, పుష్ప, సుజాత, యామిని, మహాలక్ష్మి, గాయత్రి, పద్మ, పరమేశ్వరి, కావ్య పాల్గొన్నారు.